నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 28 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI

బీఆర్ఎస్ రైతు మహాధర్నా సందర్భంగా నల్లగొండలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు

రైతు మహాధర్నాకు క్లాక్ టవర్ సెంటర్‌లో పూర్తయిన ఏర్పాట్లు

సర్కారుపై రైతు రణం

నల్లగొండలో నేడు బీఆర్ఎస్ రైతు మహా ధర్నా

- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు
- సర్కారు హామీల విస్మరణతో స్వచ్ఛందంగా తరలిరానున్న ఉమ్మడి జిల్లా రైతాంగం
- క్లాక్ టవర్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి .. పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల, కిశోర్
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ధర్నా
- ఎన్‌జీ కళాశాల, లతీఫ్ సాహెబ్ గుట్ట, చర్చి కాంపౌండ్‌లో వాహనాల పార్కింగ్

అధికారంలోకి వస్తే రైతును రాజును చేస్తామంటూ అరచేతిలో వైకుంఠం చూపించి అందలమెక్కిన తర్వాత అన్నదాతలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఉమ్మడి జిల్లా రైతాంగం సిద్ధమైంది. రైతు మహా ధర్నా పేరుతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లగొండలోని క్లాక్ టవర్ వేదికగా మోగనున్న జంగ్ సైరన్‌కు పెద్దఎత్తున స్వచ్ఛందంగానే రైతులు వచ్చేందుకు సన్నద్ధమయ్యారు. ధర్నాకు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావుతోపాటు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ నెల 21నే ఈ ధర్నా నిర్వహించాల్సి ఉండగా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. మహా ధర్నా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే నిర్వహించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో రైతులు సకాలంలో వచ్చి ధర్నా పూర్తి కాగానే వెళ్లాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు.

– నల్లగొండ, జనవరి 27

హామీల అమలుపై పోరు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12నెలలు అవుతున్నా రైతులకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో నెరవేర్చకపోవటంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు ఇంకా ఇవ్వాల్సిన రుణమాఫీ, రైతు భరోసా, సాగునీరు తదితర వాటిపై బీఆర్ఎస్ నేతలు రైతులతో కలిసి అధికార కాంగ్రెస్‌ను ధర్నాలో నిలదీయనున్నారు.

పార్కింగ్ ప్రదేశాలు..

ధర్నాకు వచ్చే రైతులు హైదరాబాద్ రోడ్డు నుంచి వచ్చే వారు ఎన్‌జీ కళాశాలలో, సూర్యాపేట రోడ్డు నుంచి వచ్చే వారు కళాభారతి స్థల ఆవరణలో, దేవరకొండ, మిర్యాలగూడ నుంచి వచ్చే రైతులు చర్చి కాంపౌండ్, లతీఫ్ సాహెబ్ గుట్ట సమీపంలో వాహనాలు పార్కింగ్ చేయాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు.

గత నెల 12న జరుగాల్సి ఉండగా..

ఈ నెల 12న నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వేదికగా మహాధర్నాకు బీఆర్ఎస్ సిద్ధమైంది. పండుగ నేపథ్యంలో పలు ఇబ్బందులు ఉంటాయని పోలీసులు సూచనతో వాయిదా వేసి ఈ నెల 21న నిర్వహించతలపెట్టింది. అప్పుడు ధర్నాకు ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు నిరాకరించిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ హైకోర్టును ఆశ్రయించగా 26న నిర్వహించుకోవాలని అనుమతి ఇచ్చింది.

నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో రైతు మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి, నాయకులు

మహా ధర్నాకు పెద్దఎత్తున కదిలి రావాలి

- ఏర్పాట్లు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

నీలగిరి : నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ రైతు మహాధర్నా ఏర్పాట్లను సోమవారం బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, నల్లగొండ, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలం, ఇతర ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, రాష్ట్రంలో ఏ ఒక్క రైతు కూడా సంతోషంగా లేడన్నారు. అన్ని పథకాలు వాయిదాలు వేస్తూ వాయిదాల ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ రైతాంగానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని దేశానికి ఆదర్శంగా నిలబడితే కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగం వెన్ను విరిచిందన్నారు. ధర్నాకు ఉమ్మడి జిల్లా రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వారి వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు సింగం రామ్మోహన్, బీఆర్ఎస్ కనగల్ మండలాధ్యక్షులు ఐతగోని యాదయ్య, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, లొడండి గోవర్ధన్, రావుల శ్రీనివాస రెడ్డి, మెరుగు గోపి, తవిటి కృష్ణ, నారగోని నర్సింహ, డి.రామ్‌రెడ్డి, కంకణాల వెంకట్‌రెడ్డి, షరీఫ్ తదితరులు ఉన్నారు.

ఏడాది పాలన @ 25 రైతు ఆత్మహత్యలు

- అప్పుల బాధతో బక్క రైతుల బల వన్మరణాలు
- కాంగ్రెస్ హయాంలో మళ్లీ ఉమ్మడి ఏపీ నాటి పరిస్థితులు
- నేడు నల్లగొండకు బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

యాదాద్రి భువనగిరి, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : నాడు భూమికి పచ్చని రంగేసినట్లు పంట పొలాలు.. అంతటా జల సవ్వడులు.. నిండు కుండలా చెరువులు.. సర్కారు సాయం.. సరిపడా ఎరువులు.. రైతుల మోములో ఆనందాలు.. కానీ.. నేడు.. విడువని కాళేశ్వరం జలాలు.. సవ్వడి లేని సాగర్ ఆయకట్టు.. నిండుకున్న చెరువులు.. పత్తాలేని సాగు నీరు.. ఎండిపోతున్న పొలాలు.. ఎరువుల కొరత.. కరువు ఛాయలు.. సర్కారు సాయం ఎగవేత.. అప్పుల బాధలు.. పట్టింపులేని ప్రభుత్వం.. వెరసి రైతుల ఆత్మహత్యలు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. మళ్లీ గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిస్థితులు దాపురించాయి. పదేండ్ల పాటు సంతోషంగా బతికిన రైతులు బక్కచిక్కిపోతున్నారు. కర్షకులు దుఃఖసాగరంలో మునిగి తేలుతున్నారు. కాలం కలిసి రాక కొందరు.. సాగు చేయక నష్టపోగా.. మరికొందరు అప్పులు చేసి చేసి పొలం చేసినా అనేక కారణాలతో పంట చేతికందని దుస్థితి ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఏకంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 25మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇందులో అత్యధికంగా అప్పుల బాధ తాళలేక ప్రాణాలు తీసుకున్నారు. నల్లగొండలో 18మంది, యాదాద్రి భువనగిరిలో ఐదుగురు, సూర్యాపేటలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యలకు గల కారణాలను రాజకీయ నిపుణులు, రైతు సంఘాలు విశ్లేషిస్తున్నాయి. ప్రధానంగా యాసంగిలో రైతు భరోసా ఎగవేత, సకాలంలో పెట్టుబడి సాయం అందించకపోవడం, అరకొరగా రుణమాఫీ, గతంలో మాదిరి యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు కాళేశ్వరం జలాలు అందించకపోవడం, నాగార్జున సాగర్ ఆయకట్టులో నీటి విడుదల లేకపోవడం, కరెంట్ కష్టాలు, ధాన్యం కొనుగోళ్లలో విఫలం తదితర అనేక కారణాలతో రైతులు ఆగమయ్యే పరిస్థితి వచ్చింది. నల్లగొండ జిల్లాలో మంగళవారం బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ పర్యటించనుంది. నల్లగొండ పట్టణంలో జరుగనున్న బీఆర్ఎస్ మహాధర్నాలో పాల్గొననుంది. అక్కడే రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి భరోసా ఇవ్వనుంది. అనంతరం వివిధ ప్రాంతాల్లోని రైతుల కుటుంబాలను సందర్శించనుంది. కర్షకుల ఆత్మహత్యలకు గల కారణాలను అధ్యయనం చేయనుంది. ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పనుంది.

మహాధర్నాను విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జనవరి 27 : రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసి, రైతుల పక్షాన పోరాడేందుకు నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యంలో నిర్వహించే 'రైతు మహాధర్నాకు రైతులు స్వచ్ఛందంగా కదిలిరావాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యాదగిరి గుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె ఆలేరు నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. రైతుబంధుకు రాంరాం పలికి, రైతుభరోసా పేరుతో రైతులను మోసం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కుట్రలు పన్నుతుందన్నారు. నాలుగు పథకాల అమలు కేవలం మండలంలోని ఒక్కగ్రామానికే మంజూరు చేసి మిగతా గ్రామాలకు ఎప్పుడిస్తారో స్పష్టత లేదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా రైతులు, ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తామని తెలిపారు. ఎరువుల షాపుల వద్ద రైతుల చెప్పులు క్యూలో కనిపిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికీ గ్రామాల్లో 60 శాతం కంటే పైగా రైతులకు రుణమాఫీ జరుగలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో యాసంగి పంటకు సాగుజలాలను అందిస్తే ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను ఎండబెడుతున్నదని మండిపడ్డారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణాధ్యక్షుడు పాపట్ల నరహరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, మాజీ కౌన్సిలర్లు దండెబోయిన అనిల్, బూడిద సురేందర్, అవుల మమతసాయి, మాజీ కో ఆప్షన్ సభ్యులు గోర్ల పద్మ, సయ్యద్ బాబా, రిజ్వానా, నాయకులు ఆరె శ్రీధర్, వాసం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత కాంగ్రెస్‌ను నిలదీయాలి

- మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి : నల్లగొండలో మంగళవారం నిర్వహించే మహా ధర్నాకు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. కేతేపల్లి మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

గోదావరి జలాలు రాకపోవడంతో నాగారం మండలంలో ఎండిపోయిన వరి పొలం(ఫైల్)

అన్నదాతపై కాంగ్రెస్ అక్కసు

ఏడాది కాలంగా రైతులను పట్టించుకోని రేవంత్ సర్కార్

- రైతు భరోసా తొలి సీజన్‌లో రూ.5వేలు, రెండో సీజన్ ఎగనామం
- ఇప్పుడు మండలంలో ఎంపిక చేసిన ఒక్క గ్రామానికే రైతు భరోసా
- రైతు రుణమాఫీ అరకొరే.. 30 శాతం మంది దూరం
- సర్కారు ముందస్తు లోపంతో గత యాసంగికి అందని సాగు నీరు
- కాళేశ్వరం జలాలు ఇవ్వకపోవడంతో ఎండిన ఎస్సారెస్పీ ఆయకట్టు
- సర్కారు నిర్వహణ లోపంతో వరుసగా ఎండిపోతున్న పైర్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్న ఉమ్మడి జిల్లా రైతాంగం

సూర్యాపేట/యాదాద్రి భువనగిరి (నమస్తే తెలంగాణ)/నల్లగొండ, జనవరి 27 :

రైతులకు అది చేస్తం.. ఇది చేస్తం..అని గొప్పగా ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అన్నదాతను అరిగోస పెడుతున్నది. కొత్తగా ఏమీ చేయకపోగా.. గతంలో సమర్థంగా అమలైన పథకాలకు కూడా పాతర పెట్టింది. ఇందుకు తార్కాణమే రైతుబంధు పథకం. అధికారంలోకి వస్తే ఏటా ఎకరాకు రూ. 15వేల పెట్టుబడి సాయం చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చిన కొత్తలో కేసీఆర్ హయాంలో అమలు చేసిన పాత పద్ధతిలోనే ఎకరాకు రూ. 5వేలు మాత్రమే అందించి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేసింది. అది కూడా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఇక యాసంగి సీజన్ పైసలు మొత్తానికే పత్తాలేవు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులకు ఎగనామం పెట్టింది. ఇక వానకాలం సీజన్ మొత్తానికి పెట్టుబడి సాయం బంద్ చేసి రైతులను మోసం చేసింది. ఇప్పుడు మళ్లీ యాసంగి సీజన్ వచ్చినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం సాయం మాత్రం దిక్కులేదు. దీంతో రైతులు చేసేదేం లేక బయట ప్రైవేట్‌లో మిత్తీలకు తీసుకొచ్చి కాలం వెల్లదీస్తున్నారు. ఈ సీజన్‌లో సర్వే పేరుతో సాగు చేయని భూములకు రైతు భరోసా లేదని అధికారులు తేల్చేశారు. రైతు రుణ మాఫీ విషయంలోనూ అన్నదాతను రేవంత్ సర్కారు మోసింది. దాదాపు 30 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదు. ఇక రైతు భరోసా ఈ నెల 26 నుంచి రూ.7500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత దానికి రూ.6వేలకు కుదించి అదీనూ మండలంలోని ఎంపిక చేసిన ఒక గ్రామంలోని రైతులకే ఇస్తున్నది. పథకాల అమలులో కాంగ్రెస్ పాలకులు చెప్తున్న మాయ మాటలతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో 11,691 మందికి రుణమాఫీ ఎప్పుడో..?

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు రుణ మాఫీ చేస్తామని ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కానీ సుమారు 8 నెలల తర్వాత జూన్ 18వ తేదీ నుంచి రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో మూడు దఫాల్లో 68,584మంది రైతులకు రూ. 553.82 కోట్లు మాఫీ చేశారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున ఆందోళనలు, రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో జిల్లా వ్యాప్తంగా మాఫీ కాని వారి వివరాలను వ్యవసాయ శాఖ సేకరించింది. ఇందులో 17వేల మంది నుంచి సమాచారం తీసుకున్నారు. ఇందులో సుమారు 5వేల మందికి పలు కారణాలు చెబుతూ కోత పెట్టారు. అయినప్పటికీ అధికారికంగా నాలుగో విడుతలో ఇంకా 11,691 మందికి రూ. 111.65 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్నోళ్లు పైడబ్బులు చెల్లిస్తే మాఫీ చేస్తామని బ్యాంక్ అధికారులు చెప్పగా.. ఆ మొత్తానికి బయట ప్రైవేట్‌కు తెచ్చి చెల్లించారు. ఇటు ఇది మాఫీ కాక..అటు వడ్డీలు కట్టలేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

రూ.300 కోట్ల రైతు భరోసా ఎగనామం

కేసీఆర్ హయాంలో జిల్లాలో ఏటా సుమారు 2.30లక్షల మంది రైతులకు దాదాపు రూ. 300 కోట్లను రైతు బంధు పేరిట పెట్టుబడి సాయం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. 2018 నుంచి 2023 వరకు 2,33,461 మంది రైతులకు రూ.2,508 కోట్ల సాయం చేసింది.

కానీ కాంగ్రెస్ సర్కారు ఓ సీజన్ మొత్తానికి పెట్టుబడి సాయం బంద్ చేసి రైతులను మోసం చేసింది. ఇప్పుడు మళ్లీ యాసంగి సీజన్ వచ్చినా.. ఇప్పటి వరకు ప్రభుత్వం సాయం మాత్రం దిక్కు లేదు. ఈ సీజన్‌లో సర్వే పేరుతో 22వేల ఎకరాలకు రైతు భరోసా లేదని అధికారులు తేల్చేశారు.

సూర్యాపేట జిల్లాలో..

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సూర్యాపేట జిల్లాలో ఇంకా రైతు రుణమాఫీ కావాల్సింది రూ.2,100 కోట్లు. రైతు భరోసా పేరిట కేసీఆర్ కంటే అదనంగా ఎకరాకు రూ.2,500 ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ఎన్నికల అనంతరం తొలి యాసంగికి రూ.200 కోట్లు ఇచ్చి ఆ తర్వాత వానకాలం సీజన్ ఎగ్గొట్టింది. వాస్తవానికి రేవంత్ సర్కార్ పెంచి ఇస్తానన్న రైతుబంధు జిల్లా రైతులకు దాదాపు రూ.600 కోట్ల వరకు బాకీ ఉంది.

కాళేశ్వరంపై అక్కసుతో పంటలు ఎండబెట్టిన సర్కారు

2018 సంవత్సరానికి ముందు సూర్యాపేట జిల్లాలో 2.73 లక్షల ఎకరాలకు మించి వరి పండకపోగా తదనంతరం 2023 వరకు ఏటా రెండు సీజన్లకు ఒక్కో సీజన్‌కు 4.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తొలి యాసంగిలోనే కాళేశ్వరంపై విషం కక్కుతూ దానిని పక్కన పెట్టడంతో గత యాసంగిలో గోదావరి జలాల విడుదల లేక ఎస్సారెస్పీ ఆయకట్టులో దాదాపు లక్షకు పైనే ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. నాగార్జునసాగర్ ఆయకట్టులో పొట్టకు వచ్చిన పంటలకు నీటిని విడుదల చేయకపోవడంతో మరో 70వేల ఎకరాల వరకు ఎండిపోయింది. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు వారి ప్రాంతానికి సాగర్ నుంచి నీటిని అక్రమంగా తరలించుకుపోవడం వల్లే నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో సాగునీటి సమస్య ఎదురైందనేది అందరికీ తెలిసిన విషయమే. ఖమ్మం జిల్లాకు నీటి విడుదల సమయంలో కాల్వలపై ఒత్తిడి పెరిగి రెండు చోట్ల గండ్లు పడి దాదాపు 50వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇక రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తానన్న రేవంత్ సూర్యాపేట జిల్లాలో 2.30 లక్షల మంది రైతులు రూ.3,012 కోట్లు పంట రుణాలు తీసుకుంటే నాలుగు విడుతలు కలిపి రూ.9,69 కోట్లు మాత్రమే మాఫీ చేయడం గమనార్హం.

నల్లగొండ జిల్లాలో ఇలా..

నల్లగొండ జిల్లాలో 5.60 లక్షల మంది రైతులకు చెందిన 12.20లక్షల ఎకరాలకు గానూ రూ.2,750 కోట్లు (రూ.7,500 చొప్పున మూడు సీజన్లకు రూ.22,500)ఇవ్వాల్సి ఉండగా తొలి సీజన్‌లో రూ. 6వేల కోట్లు (రూ.5వేలు చొప్పున)మాత్రమే ఇచ్చింది. ఇంకా రూ.21వేల కోట్లు ఇవ్వాల్సి ఉంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొలి బీఆర్ఎస్ సర్కార్ 2018 వానకాలం నుంచి రైతుబంధు పేరుతో రైతులకు పెట్టుబడి సాయం అందజేసింది. తొలుత ఎకరానికి రూ.4వేలు ఇచ్చిన గత సర్కార్ ఆ తర్వాత సీజన్‌కు రూ.5వేల చొప్పున మొత్తం తొమ్మిది విడుతలు ఇచ్చింది. జిల్లాలోని 4.60లక్షల మంది రైతులకు చెందిన 12.20లక్షల ఎకరాలకు ప్రతి సీజన్‌లో రూ.610కోట్ల చొప్పున మొత్తం రూ.5,550కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది.

90వేల మందికి కాని రూ.2లక్షల రుణమాఫీ

2018 సంవత్సరంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 4.80లక్షల మంది రైతులు ఉండగా వారిలో 3.35లక్షల మంది పంట రుణాలు తీసుకున్నారు. వారిలో నాలుగు విడుతలుగా 2.45లక్షల మంది రైతులకు రూ.2,004 కోట్లు మాఫీ చేసిన సర్కార్ రెండు లక్షలకు పైన ఉన్న వారిని మిగిలిన డబ్బులు బ్యాంకుల్లో జమచేయాలని, బ్యాంకుల్లో పేర్లు, ఆధార్ కార్డులు సరి చేసుకోవాలని ఎన్నో లింక్‌లు పెట్టింది. 90 వేలు మంది రైతులు అన్నీ చేసుకున్నా వారికి మాత్రం రుణమాఫీ కాకపోవటం గమనార్హం.

సకాలంలో సాగర్ నీళ్లివ్వని సర్కారు..

బీఆర్ఎస్ సర్కార్ రాష్ట్రంలో 2014 జూన్‌లో అధికారంలోకి వచ్చిన సమయంలో నాగార్జున సాగర్‌లో 509అడుగుల లోతులో నీరు ఉంటే ఎడమ కాల్వకు సాగు నీరిచ్చి నాటి సీఎం కేసీఆర్ ఆదిలోనే అన్నదాతల హృదయాలను గెలుచుకున్నారు. అప్పటి నుంచి ఏటా రాజీలేకుండా ఎడమ కాల్వతోపాటు ఏఎమ్మార్పీ హై లెవల్, లో లెవల్ కెనాల్స్‌కు సాగు నీరు ఇవ్వడంతో ప్రతి సీజన్‌లో 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యేది. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సాగర్‌లో 514అడుగుల్లో నీళ్లు ఉన్నా సాగుకు చుక్క నీరు ఇవ్వకపోవడంతో గత యాసంగి మొత్తం ఆయకట్టు ప్రాంతంతోపాటు జిల్లాలో కరువు వచ్చి వరి సాగు కాలేదు. వర్షాలు పడ్డప్పటికీ వానకాలంలోనూ కాల్వలు, ప్రాజెక్టులు, మోటర్ల వద్ద ఏర్పడ్డ చిన్న మరమ్మతుల కారణంగా సాగర్ నుంచి పూర్తి స్థాయిలో నీళ్లివ్వలేదు. దాంతో చెరువులు నిండలేదు. భూగర్భ జలాలు పడిపోయాయి. పలు చెరువుల్లో నీళ్లు లేక మత్స్యకారులు చేపపిల్లలు పోయలేక పోయారు. దాంతో వారి ఉపాధికి గండిపడింది.